క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు


గ్రామంలో విచారణ చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

పాణ్యం: మండల పరిధిలోని కొలూరు గ్రామంలో నీటి సమస్య తీవ్రమవ్వడంతో సాక్షి దినపత్రికలో "కొలూరులో నీటి సమస్య" అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ మనోహర్, డీఈ శివమోహన్, ఏఈ మధుశేఖర్ గ్రామంలో పర్యటించారు. గ్రామంలో నీటి విడుదల, సమస్యపై ఆరా తీశారు. రాత్రి సమయంలో నీటి వదలడం వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఉదయం, సాయంత్రం వేళల్లో నీటిని వదిలేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

యోగా డేను జయప్రదం చేద్దాం


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాణ్యం: యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాణ్యంలో అధిక సంఖ్యలో యోగా చేసేందుకు వీలుగా స్థలాన్ని పరిశీలించారు. పాణ్యం ప్రభుత్వ పాఠశాల, విజయానికేతన్, శ్రీకృష్ణ కల్యాణ మండపం తదితర ప్రదేశాలను పరిశీలించామన్నారు. ప్రజలంతా యోగా కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓలు కోటయ్య, సుబ్రమణ్యం, ఆయుర్వేద డాక్టర్ శ్రీదేవి, తదితరులు ఉన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సత్కారం


సతీష్ చంద్రను సత్కరించిన కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: నీట్‌లో ఆల్ ఇండియా 181వ ర్యాంకు సాధించిన జీకే సతీష్ చంద్రను వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి గురువారం అభినందించారు. హుసేనాపురం గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు జీకే వెంకటసుబ్బన్న, శిరోమణి దంపతుల కుమారుడు జీకే సతీష్ చంద్ర టాప్ ర్యాంకు సాధించడం అభినందనీయమని అన్నారు. విద్యార్థిని శాలువాతో సత్కరించారు.

అనాథ పిల్లల రక్షణకు 'ఉయ్యాల'


బస్టాండ్ ఆవరణలో ఉయ్యాలను ఏర్పాటు చేసిన ఐసీడీఎస్ అధికారులు

కర్నూలు సిటీ: మహిళా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో అనాథ పిల్లల రక్షణ కోసం ఉయ్యాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల, సీడబ్ల్యూసీ చైర్మన్ జుబేదా బేగం పాల్గొని ఉయ్యాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. అప్పుడే పుట్టిన నవజాత శిశువులను వద్దనుకున్న వారు ముళ్ల కంపలు, మురికి కాలువల్లో, ఊరి చివర్లో ఎక్కడపడితే అక్కడ వదిలేస్తున్నారని, తద్వారా శిశువులు గాయపడి చనిపోతున్నారన్నారు. అలా చేయకుండా సురక్షిత ప్రదేశాల్లో వదలాలని, అలాంటి వారి కోసమే బస్టాండ్ ఆవరణలో ఉయ్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఐసీడీఎస్ అధికారులు టి.శారద, డీసీపీయూ సిబ్బంది శ్రీలక్ష్మీ, పద్మ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

25న ఆటో యూనియన్ మహాసభలు

కర్నూలు(సెంట్రల్): ఆటో యూనియన్ ఓల్డ్ సిటీ నగర మహాసభలను ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి ఎం.విజయ రామాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీవి హార్‌లోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే మహాసభలకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికుడి మృతి

దేవనకొండ: స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్మికుడిగా పనిచేస్తున్న హరిజన గోపాల్ (42) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి దేవనకొండ సర్పంచ్ బండ్లయ్య రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేసి గోపాల్ మృతి పట్ల సంతాపం తెలిపారు.

చిరు వ్యాపారులపై జులుం ప్రదర్శించడమేంటి ?

- దుకాణాలు తొలగించాలని పదేపదే నోటీసులివ్వడం సరికాదు
- పనులు ప్రారంభిస్తే స్వచ్ఛందంగా తొలగిస్తామన్నా వినరా
- హైవే అధికారులపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అసహనం


చిరు వ్యాపారుల సమస్యలు తెలుసుకుంటున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: జీవనోపాధి కోసం రోడ్డుపై దుకాణాలు వేసుకుని బతికే వారిపై అధికార ప్రతాపమేంటని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు పాణ్యం వచ్చిన ఆయన్ను బస్టాండ్ వద్ద దుకాణాదారులు కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. పదేపదే తమకు నోటీసులిచ్చి క్రేన్‌లతో భయపెడుతున్నారని, ఎలాంటి రోడ్డు పనులు చేయకుండానే ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. రోడ్డు పనులు మొదలుపెడితే తామే దుకాణాలు తీసేస్తామని చేబుతున్నా వినిపించుకోవడం లేదని వాపోయారు. తమ జీవనోపాధి దెబ్బతినేలా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పొట్టకూటి కోసం రోడ్డుపై బతికే వారిపై జులుం ప్రదర్శించడం సరికాదన్నారు. రోడ్డుపై వ్యాపారాలు చేస్తూ సుమారు వందకు పైగా కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. హైవే అధికారులు ఏదైనా అభివృద్ధి పనులు చేపడితే దుకాణాదారులే స్వచ్ఛందంగా తొలగిస్తామని చెబుతున్నా వినకపోవడం మంచి పద్ధతి కాదన్నారు. హైవే నిర్వహణ ఎంత దారుణంగా ఉందో గుర్తించుకోవాలన్నారు. చిన్నపాటి వర్షం పడితే పీయూపీ, వీయూపీల కింద నిల్వ ఉండే నీటితో ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో చూడాలన్నారు. ముందు వాటికి పరిష్కారం చూపాలన్నారు. ఎవరో చేప్పారని, హైవే పక్కన ఉన్న దుకాణాలు, తోపుడు బండ్లపై హైవే అధికారులు ప్రతాపం చూపరాదన్నారు. పదపదే నోటీసులిచ్చి వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. సమస్యను హైవే, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళమని, అండగా ఉంటామని చిరు వ్యాపారులకు హామీ ఇచ్చారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సుబ్బరాయుడు, పుల్లయ్య, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, మాజీ ఉప సర్పంచ్ ఆటో మాబు, క్రిష్టారెడ్డి, వెల్డింగ్ చాంద్, ఎల్లగౌడ్, కాంత్, వడ్డుగండ్ల రాముడు, బాబి, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పోలీసుల తీరుపై మహిళ ఆవేదన

పాణ్యం: తన ఇంట్లో ఏడు నెలల క్రితం రూ.2 లక్షలు చోరీ జరిగిందని.. స్టేషన్‌కు వెళితే ఎవరూ పట్టించుకోలేదని, కేసు నమోదు చేయకపోగా ఇంటికి పోలీసులను కాపలాగా పెట్టాలా అంటూ వ్యంగ్యంగా మాట్లాడారని పాణ్యం గ్రామానికి చెందిన పాలం వెంకటరమణమ్మ కాటసాని ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నో సార్లు స్టేషన్ వద్దకు వెళ్లినా ఫలితం లేకుండా పోయిందని.. మీ ఇంట్లో అంత నగదు ఉందా అని పోలీసులు హేళన చేశారని వాపోయింది. వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండాపోయిందన్నారు. న్యాయం చేయాలని కోరింది. స్పందించిన కాటసాని విషయాన్ని పోలీసు ఉన్నతాదికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

యెగా డే ఘనంగా నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లా అంతటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా యోగా ఏర్పాట్లపై కలెక్టర్ మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో సమీక్షించారు. అన్ని వేదికల్లో ఉదయం 7 గంటలకు యోగా ప్రారంభం కావాలన్నారు. యోగాకు వచ్చే వారికి కచ్చితంగా మ్యాట్లను ఏర్పాటు చేయాలని సూచించారు. యోగా దినోత్సవం కోసం నిధులను విడుదల చేశామని, ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం సాయంత్రంలోపు అన్ని వేదికల్లో ఏర్పాట్లు పూర్తి కావాలన్నారు.

ఎల్ఎల్‌బీ పరీక్షలకు 8 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో ఓల్డ్‌సిటీలోని ఉస్మానియా బీఈడీ కళాశాల పరీక్ష కేంద్రంలో నిర్వహిస్తున్న ఎల్ఎల్‌బీ 3, 5 సంవత్సరాల కోర్సుల సెమిస్టర్ పరీక్షలకు గురువారం 8 మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో జరిగిన లా మూడు సంవత్సరాల ఆరో సెమిస్టర్ పరీక్షలకు 230 మందికి 224 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఐదు సంవత్సరాల 10వ సెమిస్టర్ పరీక్షలకు 32 మందికి 30మంది హాజరైనట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

నాణ్యమైన మందులనే అమ్మాలి


ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పెస్టిసైడ్స్ డీలర్లు రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులను మాత్రమే అమ్మాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. ఆయన గురువారం మండల పరిధిలోని కొత్తకోట, గుండ్రేవుల గ్రామాల్లో పర్యటించి, పలు విత్తన, ఎరువు, పురుగు మందుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన దుకాణాల అనుమతి పత్రాలను, స్టాక్ రికార్డులను పరిశీలించారు. దుకాణ డీలర్లతో ఏఓ మాట్లాడుతూ, విత్తనాలను ఎమ్మార్పీకే అమ్మాలని, అధిక ధరకు అమ్మినా, నకిలీ ఎరువులను అమ్మినా దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలన్నారు. రైతాంగం నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అనుమతులున్న, నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. పత్తి విత్తన నాణ్యతను తెలుసుకోవడంపై స్థానిక రైతులకు సూచనలు చేశారు. వ్యవసాయ సహాయకులు, ఎంఈఓలు వెంట ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే!


గోరంట్లలో బురదమయంగా మారిన తేరు బజార్

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో చినుకు పడితే చాలు రోడ్లన్నీ మడుగులను తలపిస్తున్నాయి. గ్రామంలో మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ముఖ్యంగా గోరంట్ల నుంచి కోడుమూరు, అమడగుంట్లకు వెళ్లే రోడ్లతో పాటు, గ్రామంలోని తేరుబజార్‌లో వాననీరు వెళ్లేందుకు దారి లేక రోడ్డుపైనే రోజుల తరబడి నీరు నిలిచిపోయి తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతున్నాయి. ముఖ్యంగా తేరుబజార్‌లో వాననీటితో పాటు, మురుగునీరు నిల్వ ఉంటుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెక్కుల పంపిణీ

కల్లూరు: కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. సూపర్ సిక్స్ పథకాల హామీలను నెరవేరుస్తున్నామన్నారు.

నేడు ఏయూ న్యూసిటీ కమిటీ మహాసభ

కర్నూలు(సెంట్రల్): ఆటో యూనియన్ (ఏయూ) న్యూసిటీ నగర కమిటీ మూడో మహాసభను శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి నగరంలోని అన్ని ఆటో స్టాండ్ యూనియన్‌లు హాజరు కావాలని కోరారు. ముందుగా నగరంలో ర్యాలీ ఉంటుందని, తరువాత సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.

కూటమి పాలనలో దళితులు, మహిళలకు రక్షణ లేదు

కర్నూలు (సెంట్రల్): రాష్ట్రంలో కూటమి పాలనలో దళితులు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదోని మండలం ధాణాపురం సర్పంచును అవమానించిన ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహించే కుప్పం నియోజకవర్గంలో భర్త చేసిన అప్పు తీర్చాలని భార్యను చెట్టుకు కట్టేసి దారుణంగా హింసించినా అడిగే నాథుడు కరువయ్యాడన్నారు. గ్రామ సభలోనే ధాణాపురం సర్పంచును బీజేపీ ఎమ్మెల్యే పార్థసారధి, టీడీపీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ ఎస్సీ అని సంబోధించి వేదికపైకి పిలవకుండా వాళ్ల కాళ్ల దగ్గర నిలబెట్టుకోవడం అత్యంత హేయమైన చర్య అని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, ఎవరైతే ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడతారో వారిపై కేసులు పెట్టి హింసిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని హెచ్చరించారు. పీసీసీ మాజీ అధ్యక్షుడు కె.బాబురావు, బజారన్న, అనంతరత్నం మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు


సిబ్బందికి సూచనలు చేస్తున్న సి.బెళగల్ వెటర్నరీ డాక్టర్ శృతి

సి.బెళగల్: మండలంలో నీలినాలుక జబ్బుకు గురైన పశువులకు ఉచితంగా మందులను ఇవ్వడం జరుగుతుందని సి.బెళగల్ పశువుల డాక్టర్ శృతి అన్నారు. సి.బెళగల్‌లో పశువైద్యుడిగా పనిచేసిన డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పత్తికొండకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పగిడ్యాల మండల పశువైద్యశాల నుంచి డాక్టర్ శృతి బదిలీపై సి.బెళగల్ పశు వైద్యశాలకు వచ్చారు. ఆమె గురువారం సి.బెళగల్ పశు వైద్యశాలలో సిబ్బందితో మాట్లాడుతూ.. సి.బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లో 5 వేల పశువులకు, అదేవిధంగా కంబదహాల్ గ్రామంలో 2 వేల పశువులకు నీలినాలుక జబ్బు నివారణకు మందులను ఇవ్వాల్సి ఉందని, లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అదేవిధంగా పశువుల దానా అవసరమైన రైతులు ఆధార్ కార్డులతో సి.బెళగల్ పశు వైద్యశాలను సంప్రదించాలన్నారు.

అతిసారం ప్రమాదకరం


అవగాహన కల్పిస్తున్న డెమో శ్రీనివాసులు శెట్టి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో ఐదేళ్లలోపు పిల్లల మరణాలకు అతిసార వ్యాధి ఒక కారణమని డెమో శ్రీనివాసులు శెట్టి చెప్పారు. గురువారం స్థానిక తారకరామ నగర్‌లో నిర్వహించిన డయేరియా నివారణపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతిసారం నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సబ్బు, నీటితో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, సురక్షితమైన తాగునీటిని వాడాలని, పిల్లలకు సమయానుసారంగా రోటావైరస్, తట్టు టీకాలు వేయించాలని, పిల్లలకు విటమిన్-ఏ సిరప్ తాగించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఎల్లప్పుడూ మరుగుదొడ్డినే ఉపయోగించాలని సూచించారు. బిడ్డకు మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే పట్టించాలని, ఏడవ నెల నుంచి అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. వారికి నీళ్ల విరేచనాలు అయితే ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలతో 14 రోజుల పాటు తప్పనిసరిగా చికిత్స అందించాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు అనురాధ, జయకుమార్, ఆశా కార్యకర్త మద్దమ్మ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఆదోని అర్బన్: పట్టణంలోని పాత బస్టాండు వద్ద బొబ్బిలి అనే వ్యక్తిని కులం పేరుతో దూషించి దాడి చేసినందుకు సన్నప్ప అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు గురువారం తెలిపారు. ఈనెల 10వ తేదీన అరంజ్యోతినగర్‌కు చెందిన బొబ్బిలి, వీరేష్‌లు బైకుపై వెళ్తుండగా వారిద్దరిని పాత బస్టాండు సమీపంలో సన్నప్ప అనే వ్యక్తి ఆపి బొబ్బిలి అనే వ్యక్తిపై కులం పేరుతో దూషించి దాడి చేశారని తెలిపారు. బొబ్బిలి ఫిర్యాదు మేరకు గురువారం సన్నప్పపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దేవనకొండ: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నుంచి కోలుకోలేక మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడని దేవనకొండ సీఐ వంశీనాథ్ గురువారం తెలిపారు. ఈనెల 8న అర్ధరాత్రి సమయంలో కరివేముల గ్రామానికి సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం మతిస్థిమితం లేని వ్యక్తిని ఢీకొట్టి వెళ్లిపోయిందన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సదరు మతిస్థిమితం లేని వ్యక్తిని 108 వాహనం ద్వారా దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరించగా, ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక 18న రాత్రి మృతి చెందాడని చెప్పారు. మృతుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే దేవనకొండ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రజకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి


మాట్లాడుతున్న సి.గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): రజక వృత్తిదారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రజక వృత్తిదారులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. రజకుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, విద్యుత్, దేవదాయ, రజక కార్పొరేషన్లలో కమిటీల్లో ప్రాధాన్యత, కుంటలు, చెరువులకు సంబంధించి జీఓ నంబర్ 343 ప్రకారం రజక రక్షణ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేశారు. విశ్వకర్మ కౌసల్య యోజన పథకం ద్వారా లబ్ధి పొందిన వారికి రుణాలు, పనిముట్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. జీఓ నంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో దోబీ పోస్టులను భర్తీ చేయాలని, మూడు నెలలకు ఒకసారి రజక వెల్ఫేర్ కమిటీ సమావేశం ఏర్పాటుచేసి రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలన్నారు. మరోవైపు రజక కార్పొరేషన్ ఏర్పాటు చేసి 8 నెలలు అవుతున్నా ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదన్నారు. నాయకులు శేషాద్రి, సి.రాముడు, జయమ్మ, సి.శ్రీనివాసులు, శేఖర్‌బాబు, ఈరన్న, ఉరుకుందు, ఎల్లయ్య పాల్గొన్నారు.

వివాహానికి వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సయ్యద్ కాశిం (ఫైల్)

తుగ్గలి : వివాహానికి వెళ్తూ.. ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని ఉశేనాపురం గ్రామానికి చెందిన సయ్యద్ కాశింవలి (62) గురువారం గుత్తిలో జరిగే సమీప బంధువుల అమ్మాయి వివాహానికి అదే గ్రామానికి చెందిన వ్యక్తితో బైక్‌పై వెళ్తుండగా గుత్తి ఆర్ఎస్ వద్ద లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కాశిం వలి తల నుజ్జునుజ్జు అయి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. మృతునికి భార్య చాందబీ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం


గూడూరులో మహాత్ముడి విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని గూడూరు నగర పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోసం గూడూరు నగర పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షలు గురువారంతో 43 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నగర పంచాయతీ కార్మికులు పట్టణంలోని మహాత్ముడి విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. కార్మికులు ఆరవింద్, మధు మాట్లాడుతూ.. తమ సమస్యలను పరిష్కరించాలని నెలరోజులకు పైగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి 15 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న వారిని పర్మినెంటు చేయడంతో పాటు, టెక్నికల్, నాన్ టెక్నికల్ ఆధారంగా నెలనెలా జీతాలను సక్రమంగా ఇచ్చి తమకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నగర పంచాయతీ కార్మికులు అల్లిబాషా, దూకేశ్వరరావు, షబ్బీర్‌బాషా, ఆంజనేయులు, బసవరాజు, జయన్న, ఖాజాహుసేన్, ప్రభాకర్, ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మహేశ్వర్

ఓర్వకల్లు: అసంక్రమిత వ్యాధుల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య సమన్వయకర్త డాక్టర్ మహేశ్వర్ ప్రసాద్ అన్నారు. గురువారం నన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని మీదివేముల బీసీ కాలనీలో నిర్వహించిన సర్వేను ఆయన పరిశీలించారు. క్యాన్సర్, అసంక్రమిత వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి సలహాలు, సూచనలు పాటించి నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుత ఆహారపు అలవాట్ల వల్ల నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు బృందంగా ఏర్పడి ఇంటింటికీ వెళ్లి 30 ఏళ్లు నిండిన వారికి వైద్యపరీక్షలు నిర్వహించాలని సూచించారు. క్యాన్సర్ వ్యాధులను గుర్తించి ప్రథమ చికిత్స చేయించాలని తెలిపారు. అలాగే 18 ఏళ్లు పైబడిన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేయించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ నాగరాజు, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, సామాజిక ఆరోగ్య కార్యకర్త శారద, ఆరోగ్య కార్యకర్త మేరీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే!

- వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం
- రోడ్డు విస్తరణకు ఇరువైపులా గుంతల తవ్వకం
- ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయని వైనం


రోడ్డు విస్తరణ కోసం తవ్విన గుంతలు


గుంతలు తవ్విన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని వైనం

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి వెల్దుర్తికి వెళ్లే రోడ్డులో గోరంట్ల గ్రామం వద్ద రోడ్డు విస్తరణ కోసం తారురోడ్డుకు ఒకవైపు 6 అడుగులకుపైగా గోతులు తవ్వారు. అయితే రోడ్డు కోసం తవ్విన ప్రాంతం వద్ద కాంట్రాక్టర్ ఎలాంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులెవ్వరైనా అదుపు తప్పితే అందులో పడిపోయే ప్రమాదముంది. పగటి వేళ ఎలాగోలా వాహనదారులు తమ ప్రయాణాలు సాగించినప్పటికీ రాత్రి వేళల్లో రోడ్డు పక్కకు వెళితే ప్రమాదం బారిన పడే ముప్పు పొంచి ఉంది. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్డు నిర్మాణం జరిగే ప్రాంతంలో ప్రమాదాలను సూచించే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సుదీర్ఘంగా బదిలీ కౌన్సెలింగ్


ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో కౌన్సెలింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులు

కర్నూలు (హాస్పిటల్): వైద్య ఆరోగ్య శాఖలో జోనల్ స్థాయి బదిలీల ప్రక్రియ సుదీర్ఘంగా సాగుతోంది. గురువారం ఉదయం ప్రారంభమైన కౌన్సెలింగ్ రాత్రంతా కొనసాగింది. బుధవారం ఏపీ హంస అసోసియేషన్ గుర్తింపు కొనసాగించాలని హైకోర్టు నుంచి ఉత్తర్వులు రావడంతో ఆ రోజు జరిగిన కౌన్సెలింగ్‌ను రద్దు చేసి గురువారం తిరిగి కొనసాగించారు. ఈ మేరకు ఎంపీహెచ్ఈఓ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎస్ఓ, డీఎస్ఓ, పీహెచ్ఎన్, స్టాఫ్ నర్సు, సీనియర్ అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంతో పాటు ప్రాంతీయ శిక్షణ కేంద్రం (మేల్), కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జూమ్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): జన్యు సంబంధిత వ్యాధి అయిన సికిల్‌సెల్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. జాతీయ సికిల్‌సెల్ అనీమియా వ్యాధి అవగాహన దినోత్సవం పురస్కరించుకుని గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ లెక్చరర్ గ్యాలరీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ఈ వ్యాధిలో ఎర్ర రక్తకణాలు గుండ్రంగా గాకుండా కొడవలి ఆకారంలో మారిపోతాయన్నారు. దీనివల్ల రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడి శరీర భాగాలకు ఆక్సిజన్ సరఫరా తగ్గిపోతుందని తెలిపారు. తీవ్రమైన నొప్పి, రక్తహీనత, అలసట, కామెర్లు, తరచూ ఇన్‌ఫెక్షన్ రావడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. వివాహం చేసుకోవాలనుకునే జంటలు పెళ్లికి ముందు రక్త పరీక్షలు చేయించుకోవడం ద్వారా ఈ వ్యాధి సంక్రమణ ప్రమాదాన్ని తెలుసుకోవచ్చని చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఈ వ్యాధి ఎక్కువగా గిరిజన ప్రాంతాల్లో సంక్రమిస్తుందన్నారు. ప్రజలు ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని, లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలన్నారు. సికిల్‌సెల్ వ్యాధినిర్ధారణ పరీక్షలు అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్, ఏపీస్యాక్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసశర్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.